భారతి

సాహిత్య మాసపత్రిక
అక్టోబరు 1978

ఎదురు తిరిగే పదాలు
నిఖిల్

వ్యవహారంలో వ్యాకరణం
ఈశ్వరచరణ్

ఆపిల్ పూలు
మిఖైల్ మిఖైలోవిచ్ కోట్స్యుబిన్‌స్కీ

ప్రతీతి
భగవతీకుమార్ శర్మ

హైందవ తర్కశాస్త్రం
నాగభూషణం

సోషలిస్టు అవాస్తవికతలు
వెంకయ్య

రాబర్ట్‌సన్ ఆర్థిక ఆలోచన
రావు

వల్లభాభ్యుదయము
శేషాచార్యులు

ఇంకా ప్రభాతం, బుచ్చిబాబు, రాధాకృష్ణశర్మ, సత్యనారాయణ, రాంమోహన్‌రాజు, మల్లెల, సంపత్కుమారాచార్య, కేఎస్వీ, బ్రహ్మానంద, నరసయ్య, కొమరయ్య, పద్మనాభస్వామి, జవహర్‌లాల్, గంగప్ప ఇతరుల రచనలు

వ్యవస్థాపకులు
దేశోద్ధారక నాగేశ్వరరావుపంతులు

శ్రీ కందుల నాగభూషణం

హైందవ తర్కశాస్త్ర పరిచయం

ఈనాటి శాస్త్రీయ పోకడలకు సరిపోయే ఆనాటి భావాలు

విషయ సూచిక

1. స్థూలంగా కొన్ని విషయాలు

1. 1) హైందవ తర్కశాస్త్రం రూపొందిన విధానం 1 2) తర్కశాస్త్రంపై అభిప్రాయాలూ, అపోహలూ 1. 3) ఈ రచన లక్ష్యం.

2. ప్రమాణాలు

2. 1) జ్ఞానార్జన 2. 2) ప్రమాణం అంటే ఏమిటి? 2. 2. 1.) ప్రత్యక్ష ప్రమాణం 2. 2. 2.) అనుమాన ప్రమాణం 2. 2. 3) ఉపమాన ప్రమాణం 2 2 4) శబ్ద ప్రమాణం **a**) అర్థయుక్త వాక్య ప్రమాణం **b**) వేద ప్రమాణం 2. 2. 5) అనుభవ ప్రమాణం 2.2 6) అర్థాపత్తి ప్రమాణం 2. 2. 7) యోగదృష్టి ప్రమాణం 2. 2. 8) ఆప్తవాక్య ప్రమాణం.

3. తర్కం

3. 1) సుజ్ఞానార్జన తత్వం 3. 2) మాటల వల్ల మనకు కలిగే జ్ఞానం 3. 3) తర్కశాస్త్రంలో వాడే కొన్ని ముఖ్య పదాలు 3. 3. 1) కారణం 3. 3. 2) కార్యం 3. 3. 3) హేతువు 3. 3. 4) సాధ్యం 3. 3. 5) నిగమనం 3. 4) కారణ కార్యాలను గురించిన కొన్ని అభిప్రాయాలు 3. 5) శాస్త్రంలో కృషి నిలిచిపోవటం 3. 6**a**) వర్జిత మధ్యమ తర్కం **b**) అవర్జిత మధ్యమ తర్కం.

4. పరార్థ హేతు - సాధ్య తర్క విధానం

4. 1) హిందువుల సిలొజిజమ్ 4. 2) చరిత్రాత్మక అంశాలు 4. 3.) తత్వాత్మక అంశాలు 4. 4) వ్యాప్తి విధానాలు 4. 4. 1) అన్వయ–వ్యతిరేకి 4. 4. 2) కేవలాన్వయి 4. 4. 3) కేవల వ్యతిరేకి 4. 5) రిడక్షియో యాడ్ అబ్సర్డం 4. 6) అనుపలబ్ధిని గురించి మీమాంసికుల భావన 4. 7) సద్హేతువు 4. 8) అరిస్టాటిల్ చెప్పిన నాలుగు కారణాలు 4. 9) హేత్వాభాసాలు.

5. ఈనాటి శాస్త్రీయ పోకడలకు సరిపోయే ఆనాటి భావాలు

5 1) అర్థాపత్తిని ప్రమాణంగా తీసికోటం 5. 2) విస్తృతీకరణ 5. 3) అభావాన్ని ఒక భావంగా చెప్పటం 5 4) రాజారామన్న సూచించిన నవీనశాస్త్రపు సమానార్థకపదాలు 5. 5) మనస్సు ప్రధానమని చెప్పే వేదాంతుల భావం 5. 6) న్యాయ స్వతంత్రత.

6. ముగింపు మాటలు

6. 1) పూర్వికుల ఔన్నత్యాన్ని గురించి ఎందుకు తెలుసుకోవాలి ? 6. 2) తర్క సాధన ప్రయోజనం.

తొలి మాట

(ఓండాక్ట్ ఇన్‌స్టిట్యూట్ వారు ప్రచురించిన అన్నంభట్టు యొక్క తర్క సంగ్రహాన్ని చదివిన మీదట, నేను అడపా తడపా తర్క శాస్త్ర విషయాలను గురించి వ్రాసికొన్న నోట్సును యీ రచన రూపంలోకి తీసికొనిరాగలిగాను. దీన్ని ఒక కొత్త దృష్టితో వ్రాశాననే నా నమ్మకం.

ఈ రచన తర్కశాస్త్రం నేర్చుకొనేందుకు ఉపయోగపడాలనే దృష్టితో వ్రాయలేదు. ఈ రోజు శాస్త్రంలో కొత్తవిగా చలామణి అవుతున్న కొన్ని భావాలను అన్నంభట్టూ, అతనికి ముందే మరి కొందరూ, వివరించారనే విషయాన్నీ, ఆ వివరించిన విషయాలేవో అవీ, పాఠకుల దృష్టికి తేవటం మాత్రమే యీ రచన యొక్క లక్ష్యం.

ఈ రచనలో దోషాలుంటే చదువరులు నాకు వాటిని తెలియపరచాల్సిందని కోరుతున్నాను.)

కందుల నాగభూషణం
48—8—15 ద్వారకానగర్,
విశాఖపట్నం—530016.

1. స్థూలంగా కొన్ని విషయాలు

1. 1) హైందవ తర్కశాస్త్రం రూపొందిన విధానం :

మనం సాధారణంగా ఒక నిర్ణయాన్ని గురించి మాట్లాడేటప్పుడు అది న్యాయంగా ఉందనో, లేదనో, లేక ఆ విషయాన్నిగురించి చాలా మీమాంస జరిగిందనో అనటం అలవాటైన సంగతి. న్యాయం అనటంలో ఉద్దేశ్యం హేతుబద్ధంగా ఉందని. మీమాంస జరిగింది అనటంలో అర్థం చర్చ జరిగిందని. న్యాయ, మీమాంస అనే ఈ రెండు మాటలు రెండు తత్వ[1]విచార పంథాలకు పేర్లు. మొదట్లో మీమాంసికులనబడే తత్వ విమర్శకులే 'న్యాయ' అనే మాటను వాడుక చేసారు. కొంత కాలానికి, ఈ మీమాంసికుల భావాలతో పూర్తిగా ఏకీభవించని కొందరు ''న్యాయ'' అనే మీమాంసికుల మాటనే తీసికొని, దాన్నే తమ తత్వానికి పేరుగా పెట్టుకొన్నారు. వీరిని, వీరి అనుయాయికులను, నైయ్యాయికు లంటారు. సత్యాన్వేషణకై నైయ్యాయికులు అవలంభించిన పద్ధతి చర్చ. దీన్ని ఆంగ్లంలో **Dialectics** లేక **Disputation** అనవచ్చు. క్రీ॥ పూర్వం దాదాపు 3వ శతాబ్దికి చెందిన గౌతముడు (**Gotama**) అనే సుప్రసిద్ధ నైయ్యాయికుడు న్యాయసూత్రాలను రచించాడు. హిందువుల తత్వ విమర్శనా పద్ధతుల్లో ముఖ్యమైనవి నాలుగు. అవి—సాంఖ్య, న్యాయ, మీమాంస, వేదాంతాలు. సాంఖ్య సూత్రాలను కపిలుడు, మీమాంసను గురించిన సూత్రాలను జైమిని వ్రాసారు. చివరిదైన వేదాంత పద్ధతిలో 'అద్వైతం, విశిష్టాద్వైతం, ద్వైతం' అనే మూడు చీలిక లేర్పడ్డాయ్. ఈ మూడింటిని వేదాంతమనే వ్యవహరిస్తారు. కాలక్రమేణ జీవాత్మ పరమాత్మల సంబంధ భావాలను ప్రచారంచేసే వేదాంతం జనసామాన్యాన్ని ఆకట్టుకోటం చూసి, మిగతా మూడు పద్ధతుల అనుయాయికులు వారి పద్ధతులను కూడా యీ విధమైన భావాలతో జోడించటం జరిగింది. పతంజలి చెప్పిన యోగ సూత్రాలతో సాంఖ్యను జోడించి సాంఖ్య—యోగాలనీ, కనాదుడు చెప్పిన వైశేషిక సూత్రాలతో న్యాయను జోడించి న్యాయ—వైశేషికలనీ, వేద భాగమైన ఉపనిషత్తులతో మీమాంసను జోడించి పూర్వ — ఉత్తర మీమాంసలనీ, మూడు జంటపేర్లతో వ్యవహరింపబడే తత్వ విధానాలను రూపొందించారు

సూత్రీకరణకు ముందే చాలా భావాలు ప్రచారంలో ఉండటం, ఆపైనే వాటిని సూత్రీకరించటం శాస్త్రవిషయంలో సాధారణం.

న్యాయ, వైశేషికలు సూత్రరూపాల్లోకి రాకమునుపే, అంటే, క్రీస్తు పూర్వం 5వ శతాబ్దినాటికే, వీటి భావాలు పండితులకు బాగా తెలుసునని చెప్పవచ్చు. సాంఖ్య, పూర్వమీమాంస, న్యాయ, వైశేషిక విధానాల్లో తర్కశాస్త్ర విషయాలు యిమిడి ఉన్నాయేగాని, వాటిని ప్రత్యేకంగా విడదీసి ఒకచోట ఎవరు పొందుపరచలేదు. హిందూ పండితులు మోక్షానికి దారిచూపే జ్ఞానసాధనంగా మాత్రమే ఏ శాస్త్రాన్నైనా అభ్యసించి కృషి చేసారే కాని,

---

1 తత్వం అంటే మూలవిషయాలూ, వాటి క్రమమూ అని చెప్పవచ్చు.

శాస్త్రాన్ని శాస్త్రం కొరకే అభ్యసించి కృషి చేయకపోవటమే ఇందుకు ముఖ్యకారణం.

జ్ఞానాన్ ముక్తిః
జ్ఞాన సాధనం శాస్త్రం

అనే సూక్తి యీ విషయాన్నే స్పష్టపరుస్తోంది. హోమకుండాల నిర్మాణానికై జ్యామితికి సంబంధించిన బీజగణితాన్నీ, యజ్ఞయాగాదుల ఆచరణకై నక్షత్ర శాస్త్రాన్నీ, దేవాలయ నిర్మాణానికై వాస్తు శిల్ప శాస్త్రాలనూ వృద్ధిలోకి తెచ్చారు. జైనులు గణితశాస్త్ర జ్ఞానాన్ని తమ మతంలోని ఒక పవిత్ర భాగంగా పరిగణించటంవల్ల యీ శాస్త్రాని కొక్కదానికే ఎక్కువ దోహదం కలిగి, కొంతవరకు, స్వతంత్ర ప్రతిపత్తి ఏర్పడ్డట్లు కనిపిస్తుంది. 11, 12వ శతాబ్దాల తరువాత హిందూ పండితులు శాస్త్రాలలోని ముఖ్యవిషయాలలో కృషి వదలివేసి, వ్యాఖ్యానాలు, వ్యాఖ్యానాలకు వ్యాఖ్యానాలు వ్రాయటంలోనూ, చిన్న విషయాలమీద పెద్ద వివాదాలు లేవతీసి వాటిల్లో తమ సామర్థ్యాలను ప్రదర్శిస్తూ తమ శక్తిని వ్యర్థం చేస్తూ వచ్చారు. దాంతో ముఖ్యమైన విషయాలలో కృషి క్షీణించి పోయింది. అయితే అదృష్టంకొద్దీ, తర్కశాస్త్రంలో యీ పరిస్థితి 17వ శతాబ్ది నాటికి కొంతమారింది

మౌలిక విషయాలకు స్వచ్ఛత చేకూరుస్తూ, తర్కశాస్త్రాన్ని సూటిగానూ, సులభంగానూ గ్రాహ్యమయ్యేటట్లు, అన్నంభట్టు[2] 'తర్కసంగ్రహ', 'తర్కదీపిక' అనే గ్రంథాలను రచించి, పండితులను ఆహ్లాదపరిచాడు. 'సిద్ధాంత ముక్తావళి'ని వ్రాసిన విశ్వనాథ పంచాననుడు కూడా యీ కోవకు చెందినవాడే.

అన్నంభట్టు కొండవీడులో గరికపాద (డు?) అనే గ్రామంలో జన్మించి, 12 సంవత్సరాలు న్యాయతత్వాన్ని అధ్యయనంచేసి, చాలాకాలం శిష్యులకు న్యాయను బోధించిన నైయ్యాయికుడని చెప్తారు. నవీనశాస్త్రాల పురోగమనానికి అన్నంభట్టు[3] విశ్వనాథుల గ్రంథాలు అనువుగా దారిచేసాయి. కాని, మన దురదృష్టంకొద్దీ ఏ కారణం చేతనో ఆ దార్లో ఎవరూ ప్రయాణం చెయ్యలేదు. కనుక పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ పురోగమనం జరగలేదు.

1. 2) తర్కశాస్త్రంపై అభిప్రాయాలూ, అపోహలూ:

హిందూ పండితులలో కొందరు తర్కశాస్త్రాన్ని చిన్నచూపు చూసినట్లు కనిపిస్తుంది. దీనికి కారణం దాని స్వరూపం, సారాంశం వారికి సరిగా అర్థం కాకపోవటమే అనిపిస్తుంది.

a) కొందరి ఉద్దేశ్యంలో తర్కం అనేది ఒక శాస్త్ర విషయానికి ఉపాంగమే కాని, ముఖ్యవిషయముకాదు. అంటే, ఇది ఒక పనిముట్టు లాంటిది అని వారు చెప్తారన్నమాట. ప్రతిశాస్త్రమూ, ఉపయోగపడేటప్పుడు పని ముట్టే అవుతుంది. అలాంటప్పుడు, యీ శాస్త్రానికి మాత్రమే దాని ప్రాముఖ్యతను తీసివేయటం సరి కాదు కదా!

b) కొందరు తర్కాన్ని 'శుష్కవాదం' అని కూడా అంటుంటారు. తర్క శాస్త్రంలో వాదం ఎప్పుడు శుష్కమౌతుందో, అప్పుడు ఆ కారణంగానే వర్జనీయం కూడా అవుతుందనే వివరణ అందులోనే ఉంది. కనుక, శాస్త్రం శుష్కవాదాలను సమర్థించదని స్పష్టమౌతూనే ఉంది. దోషం శుష్కవాదాలు చేసేవారివే కాని శాస్త్రానిది కాదు.

c) మరికొందరు తర్కశాస్త్రాన్ని ఊహ అని వివరిస్తారు. ఇది కొన్ని సందర్భాలలో మాత్రమే సరియైనది. ఆ సందర్భాలు 'అర్థాపత్తి'[4] అనే ప్రమాణాన్ని వాడినప్పుడు వస్తాయి. చాలామంది ఊహను తర్కంలో భాగంగా మాత్రమే స్వీకరిస్తారు. కొంత మంది భాగంగా కూడా స్వీకరించరు. అందువల్ల తర్కశాస్త్రాన్ని మొత్తం అంతా కలిపి ఊహ అని చెప్పటం సరికాదు.

d) ఇంకా కొంతమంది, తర్కమూ, దానికన్నా మంచి తర్కమూ, దానిపై కోవకు చెందే మరీ మంచి తర్కమూ ... అంటూ తర్కాల పరంపరను గురించి చెప్తుంటారు. ఇక్కడ తర్కం అంటే వాదములో తెలివైన సమయస్ఫూర్తి అనే భావం కన్పడుతుంది. హేత్వాభాసంలేని (అభాసుకాని హేతువాదం, అంటే, దోషంలేని హేతువాదం, అంటే, Logic without fallacy). శాస్త్రబద్ధమైన నిర్ధారణనే తర్కం అంటాం. అదే ''సు'' తర్కం.ఇందులో మేలైన రకం అనేది వేరే ఉండదు.

e) ఒక్కొక్కప్పుడు లాఘవతర్కం అనే పదం ఎదురౌతుంది. దీన్ని ఆంగ్లంలో Principle of Parsimony అంటారు. దేనికైనా మనం అనేక కారణాలను ఊహిస్తే, వాటి అన్నింటిలోనూ సులభతమమైన దాన్ని స్వీకరించటమే లాఘవతర్కం. సులభమైన ప్రతిదీ సరియైనది కానక్కరలేదు కదా! కనుక లాఘవతర్కం అనేది తర్కంలో భాగం కాదు.

---

2 అన్నంభట్టు 15వ శతాబ్దంవాడు కాక 17వ శతాబ్దం వాడని భావించటమే సరియైనదని అనిపిస్తుంది. దీనిని గురించి భండార్కర్ ఓరియంటల్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ వారి తర్కసంగ్రహ ప్రచురణలోని ఆంగ్లపీఠికలో కొంత చర్చ ఉంది.

3 డా॥ రాజారామన్నగారి ఉపన్యాసం, భవన్స్ జర్నల్, ఫిబ్రవరి 1, 1978.

4 ఈ ప్రమాణాన్ని గురించి ముందర తెలిసికుంటాం.

f) కొన్ని సందర్భాలలో యుక్తి అనే మాటను వాడ్తారు దీన్ని రెండు అర్థాలలో వాడటం ఉంది. మొదటిది, సద్హేతువాదం అనే అర్థం. ఈ అర్థంలో వాడినప్పుడు, యుక్తి అంటే శాస్త్ర బద్ధమైన హేతువాదమౌతుంది ఇక, రెండోది సమయస్ఫూర్తి అనే అర్థం. అందువల్ల సందర్భాన్నిబట్టి యుక్తి అనే మాటకి అర్థాన్ని నిర్ణయించుకోవాలి.

g) శంకరాచార్యుడు శృత్యనుగ్రహీత (శృతి–అనుగ్రహీత) తర్కం అనే మాటను వాడుతాడు. దీన్ని గురించి యిక్కడ చర్చించటం మన ఉద్దేశ్యం కాకపోయినా, క్లుప్తంగా విషయాన్ని సూచించాలి. పరమార్థ విషయాలను చర్చించటంలో కూడా తర్కవిధానాన్ని వాడవలసి వస్తుంది. ఆ సందర్భాల్లో వేదప్రమాణాన్ని భంగపరచని విధంగా తర్కశాస్త్రాన్ని వాడుకోవాలనేదే శంకరుడు ఆమోదించిన శృత్యనుగ్రహీత తర్కం.

1. 3) ఈ రచన లక్ష్యాలు :

మనం అవలంభించే దృక్పథంమీద, అంటే, ఏఏ స్వీకృతాలను (Assumptions, axioms ను) తీసికొని, తర్కాన్ని వాడుతామో వాటిమీద, మనం నిర్ధారించే సిద్ధాంతాలు ఆధారపడి ఉంటాయి. ఏ పంథాలో నడిస్తే, ఏ సిద్ధాంతాలు వస్తాయో, వాటి జాబితాలను తయారుచేసి చూపటం ఈ రచన లక్ష్యం కాదు తర్కశాస్త్ర స్వరూపం ఏమిటో, మన అనుభవంలో ఉన్న కొన్ని సాధారణ విషయాలు హిందూ తర్కశాస్త్రంలో ఏ విధంగా అన్వయమౌతాయో విశదీకరించటమే మొదటి లక్ష్యం.

హిందూ తర్క శాస్త్రవేత్తలు వివరించిన కొన్ని భావాలు యీనాడు శాస్త్రంలో కొత్తవిగా చలామణి అవుతున్న భావాలతో ఏ విధంగా ఏకీభవిస్తున్నాయో, ఆ విషయాన్ని తెలుపటం ఈ రచన యొక్క రెండో లక్ష్యం.

2. ప్రమాణాలు

2. 1) జ్ఞానార్జన :

వైదిక కర్మకాండల ద్వారా ముక్తిని పొందవచ్చునని మీమాంసికులు కొందరు తలచారు. ఇది సరికాదనీ అవి మనశ్శుద్ధిని కల్గించేంతవరకే ఉపయోగపడుతయ్యనీ, ఆ తరువాత చింతన, పరామర్శల ద్వారా సత్యాన్వేషణ జరిపితే కాని మానవుడు ముక్తిని పొందజాలడనీ, నైయ్యాయికుడైన గౌతముడు బోధించాడు. జ్ఞానార్జనకి అవసరమైన శాస్త్రాలను చక్కగా అభ్యసించాలి. ఈ ఆశయంతోనే అన్నంభట్టు 'తర్క సంగ్రహం, తర్కదీపిక' అనే శాస్త్ర గ్రంథాలను రచించినట్టు కన్పిస్తుంది. జ్ఞానం సంపాదించాలంటే, పదార్థాలు, వాటి సంబంధాలు, భేదాలు, మొదలైన విషయాలను తెలుసుకొని, ఆపైన ఆలోచన, మననం, వివేచన, మొదలైన విధాల్లో కృషి చెయ్యాలి. అందువల్ల జ్ఞానార్జనకి ఏ పద్ధతి ననుసరించినా, ప్రత్యేకమైన అర్థాలతో వాడే ఏదో రకమైన పదజాలం, అవీ, ఇవీ ఉంటాయి. అన్నంభట్టు సర్వాన్ని ఏడు పదార్థాలుగా విభజించాడు. ఇక్కడ పదార్థం అనే మాటను వ్యుత్పత్తి అర్థంలో వాడాడు. ఒక అర్థం గల పదంతో పిలువదగ్గ వాటిని ఒక పదార్థం కింద చెప్పాడన్నమాట. ఈ ఏడింటిలోనూ ద్రవ్యం (Matter) మొదటి రకం. ద్రవ్యం మళ్ళీ 9 విధాలు. రెండో పదార్థం గుణం (Quality). గుణం మళ్ళీ 24 విధాలు. మూడో పదార్థం కర్మ (Action). సామాన్య (Generality), విశేష (Particularity), సమవాయ (Inherence), అభావ (Negation) అనేవి. మిగిలిన నాలుగు పదార్థాలు. పృథివి, ఆపః (నీరు, అంటే ద్రవపదార్థం), తేజస్సు, వాయువు, ఆకాశం (ఆంగ్లంలో Ether అనే టటువంటిది), కాలం, దిక్కు (ప్రదేశం లేక space), ఆత్మ, మనస్సు అనే తొమ్మిదీ ద్రవ్యాలు. ఈ రకమైన జాబితాలను వివరించటం, వాటిని గురించిన భావం కొంతైనా కల్గించటం మంచిదని చెప్పటం జరిగింది. పదార్థం అనే మాటను తీసికొందాం. అందరు పండితులు దీన్ని ఒకే విధంగా నిర్వచించలేదు. రకాలలోకి విభజనలు ఎవరి అభిరుచులనుబట్టి వారు చేసారు. గౌతముడు పదార్థాలను 16గా విభజించాడు. వేదాంతుల్లో కొందరు 'సత్, చిత్' అనే రెండు పదార్థాలనే గుర్తించారు. మరికొందరు 'సత్, చిత్, ఈశ్వర' అనే మూడింటిని గుర్తించారు. సాంఖ్యులు 25 పదార్థాలను, మీమాంసికులు 8 పదార్థాలను వివరించారు. కాని అందరి లక్ష్యం ఒకటే. వీటిని గురించి తెలుసుకొన్నాక, వివిధ ప్రమాణాల ద్వారా తెలియవచ్చే విషయాలను తర్కించి, చర్చించి, దీర్ఘంగా ఆలోచించి, సుజ్ఞానార్జన చేసి, మోక్షసాధన విధానాన్ని తెల్పటమే అందరి లక్ష్యమూనూ. అందుకనే 'వినినంతనె వేగపడక వివరింపతగున్' అనే సూక్తిని చాలా గొప్ప అనుభవంతో చెప్పిన మాట అని తెలుస్తోంది.

2. 2) ప్రమాణం అంటే ఏమిటి ?

ఇప్పుడు జ్ఞానార్జనను తత్వాత్మకంగా పరిశీలిద్దాం. జ్ఞానార్జన ఎల్లా సాధ్యమౌతుంది? ఆర్జించిన జ్ఞానం ఎప్పుడు ఆమోదకర మౌతుంది? అనే అతి ముఖ్యమైన ప్రశ్నలు ఎదురౌతాయి. దేన్ని గురించైనా కలిగిన జ్ఞానం ఆమోదయోగ్యమైన విధానంలోనే కలిగిందని నిర్ణయించితే ఆ విధానాన్ని ఒక 'ప్రమాణం' అని అన్నారు. ప్రమాణాలను సాధారణంగా ఎనిమిది విధాలుగా చెప్తుంటారు. అవి – ప్రత్యక్షము, అనుమానము, ఉపమానము, శబ్దము, అనుభవము, అర్థాపత్తి, యోగదృష్టి, ఆప్తవాక్యము. అందరూ అన్నింటినీ ఒప్పుకోరు. హిందూ పండితు లందరూ మత దృష్టితోనే ఈ విషయాలను చర్చించారని యిదివరకే చెప్పుకున్నాం కదా! కనుక, వీరందరూ శబ్ద ప్రమాణాన్ని ఒప్పుకొంటారు. చార్వాకు లనేవారు ప్రత్యక్ష ప్రమాణాన్నొక్కదాన్నే ఒప్పుకొంటారని

చెప్పారు. హిందూ పండితు లందరూ ప్రత్యక్ష, అనుమాన, శబ్ద ప్రమాణాలను ఒప్పుకొంటారు. మిగతా అయిదింటిలో మాత్రం కొందరు కొందరు కొన్నింటినే ఒప్పుకొంటూ ఉంటారు.

2. 2. 1) ప్రత్యక్ష ప్రమాణం

చూపు, వాసన, స్పర్శ, రుచి, వినికిడి — వీటిద్వారా, అంటే కళ్ళు, ముక్కు, చర్మము, నాలుక, చెవులు అనే యింద్రియాలు చేసే పనులవల్ల మనం ఏవిషయాన్నైనా తెలిసికొంటే, ఆ జ్ఞానం మనకు కలిగిన విధానమే ప్రత్యక్ష ప్రమాణం.

జ్ఞానానికి ఆధారం ఏమిటనే ప్రశ్నను చర్చిస్తున్నామే కాని, ప్రమాణ విధానంలో ఏ దోషాలున్నాయి అన్న విషయం గురించి వివరించటానికి పూనుకోవటంలేదు. మనకు కలిగిన జ్ఞానం ఎంతవరకూ వ్యక్తిగతం? ఎంతవరకు దేశకాల పరిమితం? అలాంటి ప్రశ్న లనేకములు ఉంటాయి. వీటికి జవాబులు చాలా ఆసక్తి కలిగించేవే అయినా, మనకు ఆ పరిశీలన ప్రస్తుతం అనవసరం.

2. 2. 2) అనుమాన ప్రమాణం :

ఒక హేతువునుంచి సాధ్యాన్ని (ఫలితాన్ని, లేక నిగమనాన్ని) నిర్ధారించటంద్వారా కలిగే జ్ఞానార్జన విధానాన్ని 'అనుమాన ప్రమాణం' అంటాం. ఈ జ్ఞానం మనకు మనస్సుద్వారా మాత్రమే కలుగుతుంది. ఈ అనుమాన ప్రమాణమే తర్కశాస్త్రానికి ఆయువుపట్టు. దీన్ని గురించి ఎక్కువగా మున్ముందు తెలుసుకొంటాం.

2. 2. 3) ఉపమాన ప్రమాణం :

జ్ఞానాన్ని ఉపమానంద్వారా సంపాదిస్తే, ఆ విధానమే 'ఉపమాన ప్రమాణం'. ఉదాహరణలో వ్యక్తంచేసిన న్యాయమే మనం పరిశీలిస్తున్న సందర్భంలో కూడా వర్తిస్తుందని నమ్మతామన్న మాట. నయ్యాయికులు ఉపమాన ప్రమాణాన్ని ఒప్పుకొంటారు. ఇతరులు చాలామంది దీన్ని ప్రమాణంగా పరిగణించరు. పోలికద్వారా ఊహచెయ్యటానికి ఉపమానం పనికివస్తుందే కాని, మనం పరిశీలిస్తున్న సందర్భం ఆ ఉపమానాన్నిఎంతవరకు పోలిఉంటుందో, దాన్నుంచి ఎంత భేదిస్తుందో తెలియదు.

ఉపమానాధారమైన వాదన అనుమాన ప్రమాణంలో ఐదు అంగాలతో ఉండే హేతు — సాధ్య తర్క భాగానికి (Syllogismకి) మొదటిమెట్టు. మనకు తెలిసిన చాలా సందర్భాల్లో ఒక న్యాయం వర్తిస్తూ ఆ న్యాయం భంగపడే ఉదాహరణలేవీ తెలియకపోతే, ఆ న్యాయాన్ని సర్వసత్యంగా సూత్రీకరిస్తాం. ఈ సూత్రీకరణను విస్తృతీకరణ (universalization) అనవచ్చు. ఈ సూత్రంతో సరిపోయేటట్టు కనపడే కొత్త సందర్భం వచ్చినప్పుడు, ఆ ఫలితమే యిక్కడ కూడా వర్తిస్తుందని స్వీకరిస్తాం. అంటే; ఒక్కటే ఉదాహరణనుంచి కాక అనేకమైన ఉదాహరణల నుంచి (విరోధ ఫలిత జ్ఞాన అభావాన్ని మద్దతుగా తీసికొని) ఫలితాన్ని సంపాదించే ప్రక్రియకు ఉపమాన ప్రమాణం నాంది అనటంలో సందేహంలేదు. హిందూ పండితులు వివరించిన రీతిగా ఐదు అవయవాలతో నిర్మాణం చేయాల్సిన హేతు — సాధ్య తర్కభాగాన్ని గురించి మళ్లీ తర్వాత విపులంగా తెలుసుకొంటాం.

2. 2. 4) శబ్ద ప్రమాణం :

a) అర్థయుక్త వాక్య ప్రమాణం :

శబ్దప్రమాణం అంటే కర్ణేంద్రియానికి కేవలం వినబడే చప్పుడు కాక, (సామాన్యంగా ఒక వాక్యరూపంలో ఉండే) అర్థవంతమైన పదజాలం తెలిపే విషయం.

ఈ ప్రమాణానికి సంబంధించిన ఆనాటి చర్చలలో యీనాడు మనకు చిత్రమైనవని అనిపించేటటువంటివి కొన్ని వాదోపవాదాలు జరిగాయి. అవి చాలావరకు నిరుపయోగమైనవి కూడాను. పాశ్చాత్యులు ఊహించిన ether వంటి ద్రవ్యంగా ఆకాశాన్ని హిందూశాస్త్రవేత్తలు నిర్వచించారు. ఇది శూన్యం కాక సర్వత్ర వ్యాపించిఉండే ద్రవ్యమని వారు భావించారు. శబ్దం ఆకాశపు గుణమని కూడా వారు స్వీకరించారు. చప్పుడు మన చెవులకు ఏ విధంగా సోకుతుందో వారు గ్రహించలేకపోయారు. అందువల్లనే అది వారికి ఒక ముఖ్యప్రశ్న అయింది. సర్వత్ర వ్యాపించి ఉండే ఆకాశంలో భాగమై, మన కర్ణములందుండే ఆకాశంద్వారా, చప్పుడును ప్రత్యక్షంగా వినగలుగుతున్నామని అనుకొన్నారు.

అర్థవంతమైన వేదవాక్యాలు శబ్దప్రమాణం అవుతాయికదా! ప్రతి శాస్త్రాన్ని హిందూపండితులు పారమార్థిక దృష్టితోనే అభ్యసించి కృషి, చేసారని యిదివరకే తెలుసుకొన్నాం. వేదవాక్యాలకు సంబంధించే ప్రయోజనం ఈ శబ్ద ప్రమాణానికి ఉందని స్పష్టమౌతోంది. అందువల్ల శబ్దంయొక్క అసలు స్వరూపాన్ని తెలుసుకోవాలనే కుతూహలం వారిలో బయలుదేరింది. దానితో, శబ్దం నిత్యమా? అనిత్యమా? అనే ప్రశ్నను లేవదీసి, చర్చలు సాగించారు.

ఆకాశం స్పర్శలేనిది కనుక దాని గుణమైన శబ్దం నిత్యం అన్నారు కొందరు. ఈ హేతువులో దోషం ఉందనీ, స్పర్శలేనిది

అనిత్యంగా ఉండవచ్చుననీ, సోదాహరణంగా చెప్పాలంటే స్పర్శలేని బుద్ధి అనిత్యమనీ చెప్తూ దీన్ని మరికొందరు ఖండించారు.[5]

అర్థవంతమైన వాక్యాన్ని ఆప్తుడో, గురువో, చెప్పితే, దాన్ని, ఆప్తవాక్య ప్రమాణమనీ, సత్యాన్వేషియైన మేధావి చెప్పితే దాన్ని యోగదృష్టి ప్రమాణమనీ, రెండు ప్రత్యేక ప్రమాణాలను త్వరలోనే తెలుసుకోబోతున్నాం.

ఏదోరకంగా అర్థం చెప్పటానికి వీలున్న వాక్యాలన్నీ ప్రమాణాలు కానక్కరలేదనే విషయం వేరే చెప్పాల్సిన అవసరంలేదు కదా! కనుక, యికమీదట సుజ్ఞాన దాయకమైన వాక్యాలను గురించే మనం ముఖ్యంగా పరిశీలించాలి.

b) వేద ప్రమాణం :

కొత్త జ్ఞానాన్ని ప్రసాదించే ముఖ్యమైన వాక్యాలకే యీ శబ్ద ప్రమాణాన్ని ప్రత్యేకంగా వర్తింపచేస్తూ, ఆ వాక్యాలను వేదంలోనివిగా తీసికొందాం. అంటే ఇక నుంచి శబ్ద ప్రమాణాన్ని వేద ప్రమాణంగా తీసుకొంటా మన్నమాట. హిందూ పండితులు వేదాన్ని ప్రమాణంగా స్వీకరించటంలో అసహజత్వమేమీలేదు. నిజం చెప్పాలంటే, ఏ మతాన్ని అనుసరించే పండితులు ఆ మతములోని మూల గ్రంధాన్ని (లేక గ్రంథాలను) ప్రమాణంగా స్వీకరించటం సహజమే కదా!

వేదం అపౌరుషేయం కనుక అది ప్రమాణం అని కొందరంటారు. అపౌరుషేయం అంటే దాన్ని రచించిన కర్త లేదని అర్థమే కాని, దీనిని రచించినది మానవులెవరూ కాక, దైవమే అని అర్థం కాదు అని కొందరి భావం. రచించిన కర్త లేనేలేనప్పుడు, ఆది లేకుండా, అన్ని కాలములందూ, అది ఉన్నది అనే అర్థం చెప్పాల్సి వస్తుంది. ఆంగ్లంలో eternal అని చెప్పే సందర్భం అన్నమాట. ఈ అర్థం ప్రకారం ఋషులు వేదాన్ని ఉన్నదాన్ని ఉన్నట్టుగా తెలుసుకొన్నారని కూడా చెప్పాల్సి వస్తుంది.

అపౌరుషేయం అనే కారణంగా కాక, వేదంలోని భాగాలను పరస్పర విరోధభావాలు రాకుండా అన్వయం చేయవచ్చుననే అభిప్రాయంతో, కపిలుడు, మొదలైన సాంఖ్యులు వేదాన్ని ప్రమాణంగా ఒప్పుకొంటారు

అయితే, వీరందరూ ఏ విషయాన్నైనా పరిశీలించకుండా గుడ్డిగా నమ్మటం సరికాదని ఒప్పుకొన్నవారే. అలాంటప్పుడు వేదంలోని అన్ని భాగాలను ప్రమాణంగా తీసికోవాలా, లేదా? అనే ప్రశ్న వస్తుంది. వేదంలో జీవాత్మ పరమాత్మల సంబంధ విషయాలైన వేదాంత భాగమే కాక, మనము నిత్యమూ ఆచరించవలసిన విధులూ, స్తోత్రాలూ, సత్యాసత్యాలకు సంబంధములేని సంగతులూ, శాస్త్రబద్ధంగా నిర్ధారించేందుకు వీలుండే అంశాలూ కూడా ఉన్నాయి. ఈ సందర్భంలో రెండు విషయాలను చెప్పాలి.

1. శంకరుడి గురువైన గోవిందపాదునికి గురువు గౌడపాదుడు. ఈ గౌడపాదునికి బౌద్ధమత మందెక్కువ గౌరవముండటమే కాక, వేదోక్తమైన కొన్ని సిద్ధాంతాలను బౌద్ధమతంలోని కొన్ని ముఖ్యాంశాలతోనూ, హేతు — సాధ్యవాదంతో వచ్చే ఫలితాలలో కొన్నింటితోనూ, అన్వయించవచ్చునని భావించాడు.

2. వేదాలలో చెప్పిన దేవతల ఉనికి, వర్ణనలు, వంటివి సత్యాసత్యాలకు సంబంధంలేని విషయాలు. కాబట్టి శాస్త్ర విధానాలకు అతీతమైన (వ్యక్తిగత) నమ్మకాలమీద ఆధారపడి ఉండే వేదాంత భాగాన్ని మినహాయిస్తే, మిగతా వేదభాగాన్ని ప్రమాణంగా ఒప్పుకోవలసిన అవసరమేమీ కనపడదు. ఆగమాలను (వేదాధార సంప్రదాయాన్ని) కూడా తర్కించాలని పావులూరి మల్లన తన 'గణిత గ్రంధంలో' (పావులూరి గణితం అనే తాటాకు ప్రతి, ఆంధ్ర విశ్వ కళా పరిషత్తు లైబ్రరీలో ఉంది.) మొదటి పద్యంలో చెప్పిన భాగం ఈ క్రింది విధంగా ఉంది —

'... ... ...
తర్క వ్యాకరణాగమాది బహు శాస్త్రప్రోక్త నానార్థ సం
పర్కాభి వ్యవహారమున్ ... ...
తర్కింపన్ గణిత ప్రవృద్ధి వెరిగా దొక్కొండెరింగించునే'

ఇతను తర్కం గణితంలో భాగమని స్వీకరించినట్లు కనబడుతుంది. ఈనాడు symbolic logic ను గణితంలో వాడుతున్న దృష్ట్యా గణిత తర్కాలమధ్య తత్వాత్మక భేద మంత లేదనే చెప్పవచ్చు. ఇది వేరే విషయం గనుక వదలివేద్దాం.

'పెద్దలు చెప్పినదానిని తర్కించరాదు, నీకేమి తెలుసునని విమర్శిస్తున్నావు?' అని ఆంక్షను విధించటం చాలా పొరపాటనీ,

5 ఒక సాధ్యానికి హేతువుగా చెప్పినది ఆ సాధ్య అభావంతో విరోధించకపోతే, దానిలో హేత్వత్వం సంపూర్ణంగా లేదని గ్రహించవలసి ఉంటుంది కదా! ఈ రెండు విరోధ (అంటే, సాధ్య, సాధ్యాభావ) విషయాలలో ప్రతిదానికి ఇది కొంత వరకే కారణం కావచ్చు. ఇటువంటి హేతువుద్వారా సాధ్యాన్ని చెప్తే ఆ దోషాన్ని 'అనైకాంతికం' అంటారు.

శబ్దానికి స్పర్శ గుణం లేదనే భ్రమలో పడ్డారు ఆనాటి హిందూ పండితులు. వారిలో కొందరు స్పర్శరాహిత్యాన్ని హేతువుగా తీసికొని, శబ్దానికి నిత్యత్వం సాధ్యంగా ఆపాదించారు. దీనిలో అనైకాంతిక దోషం ఉంది. ఎందుకంటే స్పర్శ రాహిత్య స్వభావం శబ్దానికి నిజంగానే ఉందనుకొన్నా, ఆ స్వభావం అనిత్యతతో విరోధించదని బుద్ధిని ఉదాహరణగా, చెప్పవచ్చును కనుక.

ప్రతి విషయాన్నీ హేతుబద్ధంగా విమర్శించి, తద్వారా జ్ఞానార్జన చేయటమే హిందూ పండితులు ఎప్పటికప్పుడు చూపిన మార్గమనీ, నొక్కి చెప్పాల్సిన అవసరం యీనాడెంతైనా ఉంది.

పరమార్థానికి సంబంధించిన విషయాలలో వేదాన్ని ప్రమాణంగా తీసుకోకపోతే మనకు కొంత తీరనిలోటు మిగిలిపోతుందని కొందరి (వేదాంతుల) అభిప్రాయం హేతువాదం ద్వారానే పరమాత్మాన్వేషణ చేసేయెడల దేవుడు ఉన్నాడనే నమ్మకంలో విరోధ భావాలేమీ లేవు అనే ఘట్టం దగ్గర యీ అన్వేషణ ఆగిపోతుంది. పరబ్రహ్మం సచ్చితానంద స్వరూపం అనే భావం కలుగటానికి వీలుండదు. ఇది లోటా? కాదా? అనేది ఎవరికి వారు నిర్ణయించుకోవాలి.

పై కారణాలవల్ల వేదప్రమాణంయొక్క ప్రాముఖ్యత పరమార్థ చింతనకు సంబంధించి ఉండే సందర్భాలలో మాత్రమే నని చెప్పవచ్చు

2. 2. 5) అనుభవ ప్రమాణం :

బ్రహ్మ జ్ఞానానికి సంబంధించిన విషయాలలో కొందరు అనుభవాన్ని ఒక ప్రమాణంగా తీసికొంటారు.

మిగిలిన సందర్భాలలో, అనుభవం అనేది ఒక కొత్త ప్రమాణం కాదు. మిగతా ప్రమాణాల ద్వారా తెలిసికొన్నదే అవుతుంది. అందువల్ల యీ సందర్భాలలో అనుభవాన్ని స్వతంత్ర ప్రతిపత్తిగల ప్రమాణంగా స్వీకరించనక్కరలేదు.

2.2. 6) అర్థాపత్తి ప్రమాణం :

ఉచితమైన ఊహను (లేక ప్రతిపాదనను) అర్థాపత్తి అంటారు.

ఉదా : పీనో దేవదత్తో దివా న భుంక్తే

అనగా—లావుగావుండే దేవదత్తుడు దివమందు భోజనం చేయడు అనే సందర్భంలో ''దేవదత్తుడు రాత్రులందు భోజనం చేస్తాడు'' అనే ఊహను చేస్తే, ఆ ఊహ అర్థాపత్తి అవుతుంది. ఎందుకంటే ఈ ఊహ ఉచితంగానే ఉంది. దేవదత్తుడు పగలు భోజనం చేయడు, అయినప్పటికి, బలిసి ఉన్నాడు అనే పొంతనా లేని రెండు అంశాలను సమన్వయపరచే ఊహ ఇది. ఇతడు రాత్రి వేళ భోంచేస్తున్నాడన్న కొత్త జ్ఞానాన్ని మనకు కలిగిస్తోంది

ఆంధ్రపత్రిక

ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.
విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకి ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మనసినిమాలు ★ డాక్టరు కబుర్లు ★ బైస్కోపు కార్టూన్
★ దినవారఫలాలు ★ మా ఊరి సమస్య ★ షూజా
★ ఇది నారీదృక్పథం ★ అయోధ్యాకాండ ★ వింత యదార్థం

★ ఇంకా — దేవీభాగవతం, వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి ! మేనేజరు, ఆంధ్రపత్రిక

యీ ప్రతిపాదన. ఈ కొత్త జ్ఞానం మనకు అర్థాపత్తి ప్రమాణం ద్వారా వచ్చినదంటాం. దీనిని అందరూ ప్రమాణంగా ఒప్పుకోరు. కొందరు వేదాంతులూ, మీమాంసికులు దీనిని ఒప్పుకుంటారు. ఇక నైయ్యాయికులు దీనిని ఒప్పుకొంటారు కాని, దీనికి స్వతంత్ర ప్రమాణ ప్రతిపత్తిని యివ్వరు. ఇది అనుమాన ప్రమాణంలోని కేవల వ్యతిరేకి కిందికి వస్తుందని వారంటారు. అర్థాపత్తిని కేవల వ్యతిరేకిగా తీసికోటం ఎంతవరకూ భావ్యమో, తెలిసికోటానికి ఆ ఉదాహరణను ఇంకొంచెం లోతుగా పరిశీలిద్దాం. ఉచితమైన ఊహ లన్నింటిని చెప్పి, దానిలో ఒక ప్రతిపాదనను మాత్రం అర్థాపత్తిగా విడదీసి చెప్పి, మిగతా ఊహల నన్నింటిని ఖండిస్తే, మన అర్థాపత్తి కేవల వ్యతిరేకి అవుతుంది. పై ఉదాహరణలో మిగతా అన్ని (ఉచితమైన) ఊహలను వివరించటం మరి జరుగలేదు కదా! ఒక వేళ, దేవదత్తుని శరీరం జబ్బువల్ల పొంగి ఉందేమో ? మరి వేరే కారణమేమైనా ఉందేమో ? అందువల్ల యీ అర్థాపత్తి కేవల వ్యతిరేకి అనటం సరికాదు. కనుక, అర్థాపత్తిని అంగీకరించక పోవటమో, లేనిపక్షంలో దానికి స్వతంత్ర ప్రమాణ ప్రతిపత్తి నివ్వటమో చెయ్యాలి

అర్థాపత్తిని ఆమోదించేవారు తద్వారా కలిగే జ్ఞానంతో విరోధించే కొత్త విషయాన్ని ఎదుర్కొనేంతవరకూ, ఆ జ్ఞానంలో తర్కాత్మక దోషమేమీ లేదనే భావిస్తారన్నమాట.

అర్థాపత్తిని ప్రమాణంగా ఒప్పుకొన్నామనుకోండి పైగా, ఆ ఊహను తప్ప వేరే ఏ ఇతర ఊహనూ చేయలేకుండా కూడా ఉన్నామనుకోండి. అటువంటి సందర్భంలో ఆ ఊహకు మనం మంచి విలువను సహజంగా యివ్వాలి. ఎందుకంటే, యీ ప్రతిపాదనవల్లనే కాని వేరేవిధంగా పైకి విరోధభావాలుగా కనబడేవాటిని సమన్వయపరచలేకపోతున్నాం కదా ! తరుచు, యిటువంటి ప్రతిపాదన ఒక తత్వాత్మక స్వీకృతంగా రూపొందుతుంది.

ఈ శతాబ్దంలో ప్రతిపాదించబడిన తరంగ గమన శాస్త్రం **(Wave mechanics)**లో ఒక ఉదాహరణ దీనికి సరిపోతుంది. కణ రూపంలో ఉండి వెలుతురు సరళరేఖల మార్గంలో ప్రసారమౌతుం దనీ, అందువల్లనే నీడల అంచులు స్పష్టంగా ఏర్పడుతాయనీ, చాలాకాలం క్రిందే గ్రహించారు. అటు తరువాత కొన్ని కారణాల వల్ల వెలుతురు తరంగాలుగా ప్రసారమౌతుందని భావించారు. అయితే ఒకేకాలంలో వెలుతురు రెండు రూపాల్లోనూ ప్రసరిస్తూ ఉంటుందని చెప్పటానికి వీలులేక తికమకపడ్డారు. డుబ్రాగ్లీ (De Broglie), ష్రూడింగర్ (Schrodinger)లు తరంగ గమన శాస్త్రాన్ని ప్రతిపాదించి, ఆ చిక్కును విడదీసి, విషయాలను సమ న్వయంచేసి, నోబెల్ బహుమతుల నందుకొన్నారు. "ప్రయోగానికి ముందు వెలుతురులో కణ, తరంగ గుణాలు రెండూ యిమిడి ఉంటాయి. వెలుతురును ఈ రెండు గుణాల్లో ఏదో ఒకే గుణాన్ని ప్రదర్శించేవిధంగా మనం చేసే ప్రయోగం చేస్తుంది" అని వారి ఊహ. ఏ గుణాన్ని ప్రదర్శిస్తుందో అది ప్రయోగంమీద ఆధారపడి ఉంటుందనే ఈ ఊహను అర్థాపత్తిగానే చెప్పాలి.

2. 2. 7) యోగదృష్టి ప్రమాణం :

గొప్ప మేధావులు బహుకాలం ఏకాగ్రతతో ఆలోచించి, గ్రహించే విషయాలను స్వీకరించటంద్వారా వచ్చే జ్ఞానాన్ని యోగ దృష్టి ప్రమాణంద్వారా వచ్చిందంటాం. తపస్సు ఫలితంగా తెలిసి కొని ఋషులు (లేక గురువు) విశదీకరించిన విషయాలు యీవిధంగా సంపాదించిన జ్ఞానభాగమే అవుతాయి. దీనిని **Transcendal perception** అంటారు. వారు నిరంతరం జరిపిన యోచన ఏ విధంగా నడిచిందో నిర్ణయించటానికి కూడా వీలులేనిదై ఉండ వచ్చు. ఈవిధమైన కృషివల్ల వారికి స్ఫురించిన విశేషాలకు మనం తప్పకుండా చాలా విలువ నివ్వాల్సిందే! సందేహంలేదు. ఉదాహరణకి న్యూటన్, శ్రీనివాస రామానుజములు అసాధారణమైన స్ఫురణ శక్తిని (Intuition based on thinking with extreme concentration) కలిగి ఉండేవారని మనకు తెలుసు. కాని, అంత మాత్రంచేత, వారు చెప్పిన ప్రతివిషయం ఆమోదించవలసినదేనా ? వారు చెప్పిన వాటిల్లో కొన్ని హేతుబద్ధముగ లేవని తరువాత తెలుసుకొన్నారుకదా?

అందువల్ల పెద్దలు కూడా ఒక్కొక్కప్పుడు భ్రమకు లోనౌతారనే కారణంగా యోగదృష్టి ప్రమాణాన్ని మీమాంసికుల్లో కొందరు ఒప్పుకోరు.

2. 2. 8) ఆప్తవాక్య ప్రమాణం :

నమ్మతగినవారు (అంటే, మోసము, డంబము లేనివారని మనం నమ్మేవారు) తమకు తెలిసిన విషయాన్ని మాత్రమే, మన హితవుకోరి చెప్పతున్నారని మనం భావించినప్పుడు వారు చెప్పిన దాన్ని స్వీకరిస్తే వచ్చే జ్ఞానం ఆప్తవాక్య ప్రమాణంవల్ల కలిగిం దంటాం. దీనినే ఆర్యవాక్య ప్రమాణమని కూడా అనవచ్చు.

ఈ ప్రమాణాన్ని సాంఖ్యులు ఒప్పుకొన్నారు. కాని, సాంఖ్య–యోగాలను కలిపి అనుసరించేవారు, దీన్ని ఒప్పుకోరు.

చేష్ట, ఐతిహ్య (సంప్రదాయం) మొదలైన ప్రమాణాలను కూడా కొందరు స్వీకరిస్తారు. వీటిలో ప్రత్యేకంగా శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రసాదించే శక్తి తగినంతగా లేదనే ఉద్దేశంతో వీటిని వదలివేస్తున్నాం.

(ఇంకా ఉంది)